క్లుప్తంగా

వైభవంగా వసంతోత్సవం



స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

గూడూరు: రాజావీధిలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం సుదర్శన చక్రానికి ప్రత్యేక పూజలు చేసి, చక్రస్నానం జరిపారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ శ్రీకంఠి రామ్మోహన్ రావు పర్యవేక్షించారు. అనంతరం స్నపన తిరుమంజం, అవబృధోత్సవం (పూర్ణాహుతి) నిర్వహించారు. రాత్రి ధ్వజావరోహణం జరిపారు. ఈ కార్యక్రమాలకు గుమిడి వెంకటసుబ్బయ్య, విజయలక్ష్మి, అనుమకొండ శ్రీనివాసు లు, సురేఖ, జొన్నా మురళీకృష్ణ, దేవీ సుచరిత, కోటేశ్వర రావు, శారదమ్మ, వెంకటరత్నం, రాజేశ్వరమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కార్తీకవనం పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న నిర్వాహకులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న నీలకంఠేశ్వర స్వామి ఆలయం సమీపంలో నూతనంగా కార్తికవనం ఏర్పాటుకు గురువారం ఆలయ నిర్వాహకులు భూమి పూజ చేసి, పనులు చేపట్టారు. ఆలయ చైర్మన్ గూడూరు సుధీర్ రెడ్డి, ప్రధాన అర్చకులు బాలాజీ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగ్గుమూడి భాస్కర్ రెడ్డి, వాణి దంపతులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పేరం శెట్టి ప్రసాద్, అవధానం సుధీర్ పాల్గొన్నారు.

రాపూరు ఎంపీపీ ఎన్నిక వాయిదా

రాపూరు: ఎంపీపీ ఎన్నిక శుక్రవారానికి వాయిదా వేసినట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి తిరుపతయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఉన్న ఎంపీపీ చెన్నుబాలకృష్ణారెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే ఎంపీటీసీ సభ్యులు ఒకరు కూడా ఈ ఎన్నికలకు హాజరుకాకపోవడంతో ఎన్నిక శుక్రవారానికి వాయిదా వేసినట్లు తెలిపారు.

బాబాకు పూజలు

ఓజిలి: మండలంలోని మానమాలలో ఉన్న బాబా మందిరంలో సాయిబాబాకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కాగడా హారతి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం దూప హారతి, రాత్రి పల్లకిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మనుబోలు మండలం బద్దెవోలు గ్రామానికి చెందిన తిన్నేలపూడి హరనాథ్‌రెడ్డి, సునందమ్మ, కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి, భార్య వాణి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

బాధ్యతగా వ్యవహరించాలి

సైదాపురం: సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కొమ్మిపాడు, చాగణం సచివాలయాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పని సరిగా విధుల్లో ఉండాలన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఉద్యోగులు జవాబు దారీగా ఉంటూ సకాలంలో సేవలను అందించాలని సూచించారు.

వైఎస్సార్ బీమా పంపిణీ



నగదు అందజేస్తున్న కార్తీక్‌రెడ్డి

వెంకటగిరిరూరల్ (బాలాయపల్లి): జయంపు గ్రామానికి చెందిన వంటేల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా నగదును నాయకులు గురువారం అందజేశారు. బాలాయపల్లి మండలం జయంపు గ్రామానికి చెందిన వంటేల వెంకటేశ్వర్లు(35) అనారోగ్యంతో ఈ నెల 5వ తేదీన మృతి చెందారు. మృతుని భార్య అంకమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ. 10వేలు నగదును జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి అందజేశారు. సచివాలయం సిబ్బంది షాహినా పాల్గొన్నారు.

ఇసుక రవాణాకు అనుమతి

వాకాడు: మండలంలోని జగనన్న లేఅవుట్లలో నిర్మిస్తున్న పక్కా గృహాలకు కావాల్సిన ఇసుకను రొయ్యల కాలువ క్వారీ నుంచే రవాణాకు అనుమతి వచ్చినట్లు ఎంపీడీఓ గోపీనాథ్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ వాకాడు మండలం బసమ్మ కండ్రిగ వద్ద రొయ్యల కాలువ నుంచి మాత్రమే జగనన్న కాలనీలకు ఇసుక రవాణాకు అనుమతి వచ్చిందన్నారు. ఇసుక ట్రాక్టర్లకు జీపీఎస్, సంబంధిత అధికారి ఇచ్చే జాబితా ప్రకారం లబ్ధిదారులు మాత్రమే ఇసుక తరలించాలన్నారు.

11న ప్రవేశ పరీక్ష

దొరవారిసత్రం: మావిళ్లపాడులోని ఆదర్శపాఠశాలలో ఆరో తరగతికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు స్థానిక ప్రిన్సిపల్ సుమలత తెలిపారు.ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.



- రైతు జనార్దనరెడ్డిది చిల్లకూరు మండలం అన్నంబాక గ్రామం. ఈయనకు రెండెకరాలు భూమి ఉంది. ఇందులో వరిసాగు చేస్తుంటాడు. ఈయన ఐదుగురు సభ్యులనున్న రైతుగ్రూపులో చేరి, ఆర్బీకే ద్వారా రాయితీ కింద ట్రాక్టర్, పనిముట్లు తీసుకున్నాడు. దీంతో ఆయన తన సొంత వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. దీనికితోడు పలు పథకాలు అందడంతో సేద్యం సులువుగా మారిందని చెబుతున్నాడు.



- చిల్లకూరు మండలం వల్లిపేడు గ్రామానికి చెందిన పోలుబోయిన కోటమ్మ మహిళా రైతు. ఈమెకు మూడెకరాల పొలం ఉంది. గతంలో సాగునీరు సరిగా అందక పంట సాగు చేయలేదు. గత నాలుగేళ్ల సాగునీరు పుష్కలంగా ఉండడంతో పంటలు పండించుకుంటోంది. పలు పథకాలు, రాయితీ పనిముట్లు తీసుకుని, సేద్యం చేసుకుంటూ కుటుంబంతో సంతోషంగా ఉంది.

ఆర్బీకేలతో వ్యవసాయం విస్తృతం

నాడు వ్యవసాయం దండుగ అని అప్పటి సీఎం చంద్రబాబు రైతులను పక్కన పెట్టేశారు. ఫలితంగా అన్నదాతకు అన్నీ అవస్థలే. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సేద్యం దండగ కాదు పండుగ అని నిరూపిస్తున్నారు. పుడమిని నమ్ముకున్న రైతులు నష్ట పోకూడదని పల్లె ముంగిటే పుడమి పుత్రుడికి పలు సేవలందించే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, వారికి కొండంత భరోసా కల్పించారు. వ్యవసాయ సహాయకులను నియమించి, రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు.



యంత్ర పరికరాలను అందజేస్తున్న ఏఓ భవానీ (ఫైల్)

- కర్షకులకు కొండంత భరోసా
- ముంగిటే ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు
- అందుబాటులో సేవలు, అధికారులు

చిల్లకూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, కర్షకులకు దుక్కు దున్నడం నుంచి పంట ఉత్పత్తి విక్రయం వరకు అండగా ఉంటోంది. యంత్రాలు, డ్రిప్ పరికరాలు, విత్తనాలు రాయితీపై ఇస్తోంది. ఎరువులు, క్రిమిసంహారక మందులు పంపిణీ చేస్తోంది. ఉద్యానవన రైతులను పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సహిస్తుంది.

వ్యవసాయ అనుబంధ శాఖలన్నీ ఒకే చోట.

చిల్లకూరు మండలంలోని 31 పంచాయతీల్లో రైతులు తమ పొలాల్లో వరి, వేరుశనగ, నిమ్మ, మిరప, పుచ్చ, ఆకుకూరలు, అరటి తదితర పంటలు సాగు చేస్తున్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలైన హార్టికల్చర్, పశుసంవర్ధక, మత్స్య, వ్యవసాయ శాఖల కార్యాలయాలు వేర్వేరుగా ఉండేవి. దీంతో గతంలో నాలుగు శాఖల అధికారులతో రైతులకు నేరుగా సంబంధాలు ఉండేవి కాదు. కానీ ఆర్బీకేల ఏర్పాటుతో వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశుసంవర్ధక శాఖలకు సంబంధించిన సహాయకులందరూ ఒకే చోట ఉంటున్నారు. దీంతో వారు గ్రామాల్లో ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ సేవలందిస్తున్నారు. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పాయి.

ఆర్బీకేల సేవల వివరాలు

మొత్తం రైతు భరోసా కేంద్రాలు	: 18
పచ్చిరొట్ట విత్తనాలు	: 103 మెట్రిక్ టన్నులు
లబ్ధిపొందిన రైతుల సంఖ్య	: 3,432 మంది
వరి విత్తనాలు	: 187 మెట్రిక్ టన్నులు
లబ్ధిపొందిన రైతుల సంఖ్య	: 1,448 మంది
ఎరువులు	: 1518 మెట్రిక్ టన్నులు
లబ్ధిపొందిన రైతులు	: 4,832 మంది
రైతు గ్రూపులు	: 19

వ్యవసాయ రంగంలో నూతన సంస్కరణలు



గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయి. సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్లను నిత్యం అందుబాటులో ఉంచి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లను అందిస్తున్నాం. గతంతో పోలిస్తే రైతులు పనుల కోసం మండల వ్యవసాయ కార్యాలయానికి రావడం పూర్తిగా తగ్గింది. వారి గ్రామాల్లోనే సేవలు పొందుతున్నారు.

\- గూడూరు భవానీ, ఏఓ, చిల్లకూరు

రైతులకు చేరువగా..



రైతులకు అన్ని సేవలు చేరువ అయ్యాయి. ఈ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు, డిజిటల్ లైబ్రరీలతో కర్షకులకు మేలు చేకూరుతుంది. అన్నదాతలు తమకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, రాయి తీ యంత్ర పనిముట్లు అన్నీ గ్రామాల్లోనే వారికి అందజేస్తున్నాం. ఏ సమయంలో ఏ పంటలు వేయాలి, ఎలాంటి మందులు వినియోగించాలి అనే విషయాలను రైతులకు తెలియజేస్తున్నాం.

\- గోపినాయక్, ఏడీఏ, గూడూరు

అన్ని వసతులతో ఆటోనగర్



సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులతో ఎమ్మెల్యే

గూడూరు: అన్ని మౌలిక వసతులతో అందరికీ అందుబాటులో ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. పట్టణ సమీపంలో ఆటోనగర్ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఆయన మున్సిపల్ కమిషనర్ సాయినాథ్‌తో కలసి గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆటోనగర్‌కు అనుసంధానంగా చిన్న చిన్న పరిశ్రమల ఏర్పాటుకు కూడా ఈ ప్రాంతం ఎంతో అనువుగా ఉంటుందన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతానికి అత్యంత చేరువలోనే జగనన్న లేఅవుట్‌తో పాటు, టిడ్కో గృహ సముదాయం కూడా ఉండడంతో, ఆటోనగర్‌కు అవసరమైన మానవ వనరులకు కూడా కొరత ఉండదన్నారు. అలాగే ఈ ప్రాంతంలో ఆటోనగర్ ఏర్పాటుతో, ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ మేరకు తక్కువ ధరలకే ఆటోనగర్‌లోని స్థలాలను అందజేసేలా కూడా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే ఈ ప్రాంతం నుంచి జాతీయ రహదారికి కూడా నాలుగులేన్ల రోడ్డు ఏర్పాటుతో కూడా ఈ ప్రాంత ప్రజలేకాకుండా, గూడూరు రూరల్ మండలంలోని పారిచర్ల, కాంద్ర, కొండాగుంట, వెందోడు తదితర గ్రామాల నుంచి, బయటి ప్రాంతాలకు వెళ్లేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, నాయకులు ఏ మురళి, తీపనూరు సర్పంచ్ వెంకటేశ్వర్లు, కే శీనయ్య, ఆటోనగర్ యూనియన్ అధ్యక్షుడు బాషా తదితరులున్నారు.



ఆటోనగర్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్ తదితరులు

హాకీపై మక్కువ పెంచుకోవాలి

హాకీ మన జాతీయ క్రీడని, ఈ ఆటపై ప్రతి ఒక్కరూ మక్కువ పెంచుకోవాలని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో హాకీ వేసవి శిక్షణ తరగతులు పూర్తి చేసుకున్న క్రీడాకారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా గురువారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే, విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రావీణ్యత సాధించాల్సి ఉందన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసమే కాకుండా, శారీరక దృఢత్వం కూడా పొందగలరన్నారు. దీంతో చదువుల్లోనూ చురుగ్గా ఉంటారని చెప్పారు.

వేడుకగా చక్రస్నానం

నాయుడుపేటటౌన్: తుమ్మూరులో శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం చక్రస్నానం, అభిషేక పూజలు వేడుకగా నిర్వహించారు. స్వామివారికి విశేషాలంకరణ చేసి సప్పరంపై కొలువుతీర్చి, పుర వీధులలో ఊరేగించారు. వేదపండితుల ఆధ్వర్యంలో వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం చక్రస్నానం చేశారు. రాత్రి ధ్వజావరోహణం జరిపారు. ఉదయం నుంచి సుప్రభాత సేవ, ఆరాధన, సహస్రనామార్చన, బలిహరణం, మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, రాత్రి ఊంజల్ సేవలతో పాటు స్వామివారికి ఏకాంతసేవ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇన్‌స్పెక్టర్లు హరిరెడ్డి, సుధీర్, గ్రామ పెద్దలు, కరిమాణిక్యస్వామి తదితరులు పాల్గొన్నారు.



చక్రస్నానం కార్యక్రమం నిర్వహిస్తున్న వేదపండితులు

నేడు పుష్పయాగం

బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన శుక్రవారం స్వామివారికి పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్లు హరిరెడ్డి, సుధీర్ తెలిపారు. ఉదయం స్వామివారి అభిషేక వేడుకలతో ఉత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి: మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా వలంటీర్ పోస్టులకు ఈనెల 18వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఈనెల 19 వ తేది స్క్రూటినీ నిర్వహిస్తామన్నారు. 20వ తేదీన ఇంటర్వ్యూలు, అదేరోజు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పనులకొచ్చేవారికే మస్టర్

వాకాడు: ఉపాధి పనులకు వచ్చే వారికి మాత్రమే మస్టర్లు వేయాలని ఎంపీడీఓ గోపీనాథ్ తెలిపారు. ఆయన గురువారం సొసైటీ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డితో కలసి ఉపాధి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గోపీనాథ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ప్రజలకు అవసరమయ్యే పనులు మాత్రమే చేయాలన్నారు. పనుల చేసే ప్రాంతంలో కూలీలకు నీరు, నీడ, తదితర వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ విజయమ్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గూడూరు: ఇటీవల కైవల్యానదిలో పడి మృతి చెందిన కూలీల కుటుంబాలకు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆర్థిక సాయం అందజేశారు. గూడూరు రూరల్ మండలం విందూరు గ్రామానికి చెందిన కొండ వెంకటేశ్వర్లు, పముకల శ్రీనివాసులు కూలీ పనులు ముగించుకుని ఇంటి వచ్చే క్రమంలో కైవల్యానదిలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయా కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి తన వంతుగా రూ. 30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించేదుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మృతుల కుటుంబాలకు భరోసా కల్పించారు. ఈయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్దుల్లా, తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి కాంట్రాక్ట్ ఉద్యోగుల పాలాభిషేకం

సూళ్లూరుపేట: కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేబినెట్ సమావేశంలో ఆమోదించడంతో సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారు గురువారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తూ ఏరోజైనా క్రమబద్ధీకరించకపోతారా అని ఏళ్ల తరబడి ఎదురుచూసిన తమను జగనన్న ఆదుకున్నారని ఆనందం వ్యక్తంచేశారు. ఆయన చేసిన మేలు మరువలేమన్నారు.

రెవెన్యూ శాఖ ప్రతిష్ట పెంచాలి

సైదాపురం: రెవెన్యూ శాఖ ప్రతిష్టను పెంచేలా రెవెన్యూ యంత్రాంగం పనిచేయాలని నెల్లూరు ఆర్డీ మలోల అన్నారు. సైదాపురం మండలం చాగణంలో గురువారం తహసీల్దార్ శ్రీనివాసులు అధ్యక్షతన రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా చాగణం రెవెన్యూ పరిధిలోని ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనివిని ఎరుగని రీతిలో చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం చూపిందన్నారు. జిల్లాలో 38 వేల ఎకరాల చుక్కల భూములకు విముక్తి కలిగిందన్నారు. అనంతరం చాగణం రాజుపాలెంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఈ భాస్కర్, ఆర్ఐ అశ్వర్థనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

రాపూరు: గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు నెల్లూరు ఆర్డీఓ మాలోల అన్నారు. రాపూరు మండలం బొజ్జనపల్లెలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్ 49లోని 42 ఎకరాల మేత పొరంబోకు భూములను పదేళ్లుగా 26 మంది రైతులు సాగు చేసుకుంటున్నామని ఆ భూములకు పట్టాలు అందించాలని కోరారు. ఉన్నతాధికారులతో చర్చించి పట్టాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని ఆర్డీఓ హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ సుభాషిణి, వీఆర్వో రాజేష్ పాల్గొన్నారు. అనంతరం తెగచర్ల సచివాలయాన్ని తనిఖీ చేశారు.

గడప గడపలో అపూర్వ ఆదరణ



లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏ ఇంటికి వెళ్లిన సీఎం అపూర్వ ఆదరణ లభిస్తుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని పుదూరులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందాయా లేదా? అని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఇప్పటివరకు పొందిన లబ్ధి వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. పలువురు వివిధ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించడంతో వివిధ శాఖల అధికారులతో మాట్లాడి, వాటిని పరిష్కరించేలా ఎమ్మెల్యే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గోనుపల్లి గురుమూర్తి, ఎంపీపీ ధనలక్ష్మి, సర్పంచ్ ఎం సుమతి, ఎంపీటీసీ సభ్యురాలు కే నరసమ్మ, మండల కన్వీనర్ టీ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్‌రెడ్డి, నాయకులు కే రాజారెడ్డి, కే మాధవ రెడ్డి, బీ మల్లికార్జునరెడ్డి, కటకం జయరామయ్య, పీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం

ఓజిలి: నూతన వధూవరులను ఎమ్మెల్యే కిలివేటి గురువారం ఆశీర్వదించారు. ఓజిలి మండలంలోని వెంకటరెడ్డిపాళేనికి చెందిన వైఎస్సార్ సీపీ నేత బట్టా సుబ్రమణ్యంయాదవ్ కుమారుడు బట్టా పృథ్వీకుమార్‌యాదవ్, సామాన్య సంయుక్త వివాహానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. నాయుడుపేట కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వివాహానికి ఎమ్మెల్యే, నాయుడుపేట, ఓజిలి, సూళ్లూరుపేట మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జీ రవీంద్రరాజు, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ జీ బాబురెడ్డి, కుందాం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కే గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు ఎం సుమ, సుబ్బరావు యాదవ్, నాయకులు కొండూరు వెంకటసుబ్బరాజు, ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

నేడు సుడిమాను ప్రతిష్ట



దేదీప్యమానంగా చెంగాళమ్మపరమేశ్వరి ఆలయం

- సాయంత్రం సుళ్లు ఉత్సవం
- ఏర్పాట్లు పూర్తిచేసిన సూళ్లూరుపేట చెంగాళమ్మతల్లి ఆలయ నిర్వాహకులు

సూళ్లూరుపేట: చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో విశేషంగా చెప్పుకునే సుళ్ల ఉత్స వం శుక్రవారం ప్రారంభం కానుంది. ఉదయం 7.45 గంటలకు అమ్మవారి గర్భాలయం ఎదురుగా సుడిమానును ప్రతిష్ఠించనున్నారు. గురువారం రాత్రి బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తూ బలిహరణ కార్యక్రమం నిర్వహించారు. వేద పండితుల వేదమంత్రోచ్చారణలతో అమ్మవారికి పూజలు చేసిన అనంతరం పట్టణంలోని ప్రముఖులు, కోళ్లమిట్టవాసులు సుడిమానును ప్రతిష్ఠించనున్నారు. శుక్రవారం సాయంత్రం 3 గంటలకు చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మగారి గ్రామమైన గొల్లలములువులోని వేనాటి కుమారస్వామిరెడ్డి (పడమటింటివారు) ఇంటి నుంచి వడిబాల సారెను తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడి నుంచి పాలకమండలి అందుకుని అమ్మవారి వద్ద పూజలు నిర్వహించి శుక్రవారం సాయంత్రం సుడిమానుకు సబంధించిన పాలవెల్లికి కట్టి భక్తులకు చూపించే విధంగా తిప్పుతారు. మొదటిగా వడిబాలు సారె, తరువాత రుబ్బురోలు, నల్లమేకపిల్లను కట్టి తిప్పుతారు. శుక్రవారం జరిగే సుళ్ల ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న సినీనటి సురభి



నృత్య ప్రదర్శన ఇస్తున్న బాలికలు

సూళ్లూరుపేట రూరల్: చెంగాళమ్మ బ్రహ్మోత్సవాల్లో తొలిరోజైన గురువారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమాలను లివేటి సంజీవయ్య, ఆలయ చైర్మన్ దువ్వూరు బాల చంద్రారెడ్డి, ఆళ్ల శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించారు. సాయంత్రం 7 గంటలకు టీటీడీ కళాకారుల బృందం ప్రదర్శించిన చెంగాళమ్మ చరిత్ర నృత్య రూపకం అలరించింది. సినీ హీరోయిన్ సురభి ఆకర్షణీయంగా నిలిచింది. సినీ ప్లేబ్యాక్ సింగర్స్ అతిథి, రేణుకుమార్‌ల సంగీత విభావరి వీనుల విందు చేసింది. ఫోక్ సింగర్ పల్సర్ బైక్ రమణ, కళాంజలి ఆర్కెస్ట్రా అందరిని ఆకట్టుకున్నాయి. జబర్దస్త్ సునామి సుధాకర్ బృందం, కొరియోగ్రాఫర్ ఢీ ఫేమ్ అభిమాస్టర్ బృందం ఆధ్వర్యంలో సాగిన హాస్యవల్లరి కడుపుబ్బ నవ్వించింది. మంగర శేషారెడ్డి, అమరావతి దంపతులు, కె. జగన్ కె. మదన్, వేనాటి ధనుజయరెడ్డి, సురేఖ దంపతులు, వరలక్ష్మి రైస్ మిల్లు విరాళ దాతలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి జన్మదినం కావడంతో స్టేజ్‌పైనే ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నటి సురభి కేక్ కట్ చేసి తినిపించారు.

వలంటీర్‌ల పోస్టులకుదరఖాస్తు చేసుకోండి

చిల్లకూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ గోపీనాథ్ తెలిపారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడారు. మండలంలోని పల్లమాల, చింతవరం, చిల్లకూరు–2 వరగలి, కడివేడు గ్రామాల్లో వలంటీర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 18 లోగా దరఖాస్తు చేసుకోవాలని, 20న దరఖాస్తుల పరిశీలన, అదే రోజున ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. చింతవరంలో (బీసీలు), పల్లమాల, కడివేడు, వరగలి, చిల్లకూరు–2లో ఎస్సీలు దరఖాస్తుల చేసుకోవాలని కోరారు. వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నైతిక విలువలు పాటించిన మహోన్నత నేత

నాయుడుపేటటౌన్: రాజకీయాల్లో నైతిన విలువలను పాటించిన మహోన్నత వ్యక్తిగా దివంగత నేత మాజీ మంత్రి పసల పెంచలయ్య అన్ని వర్గాలకు చెందిన ప్రజలు గుండెల్లో గూడు కట్టు కున్నారని పలువురు నాయకులు పేర్కొన్నారు. దివంగత మాజీ మంత్రి పసల పెంచలయ్య 8వ వర్ధంతి సందర్భంగా గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఆయ న నివాళులర్పించారు. తుమ్మూరులోని పెంచల య్య సమాధి వద్ద ఏర్పాటు చేసిన స్మృతివనం వద్దకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, పెంచలయ్య సతీమణి పసల జ్ఞానవతి, ఆయన కుమార్తె కిలివేటి సుభాషిణి, మనవరాళ్లు కిలివేటి దివిజ, సౌజన్యల తో పాటు నాయకులు పెంచలయ్య స్మృతివనం వద్ద పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ టీ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ రాధ, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, ఎంపీపీలు ధనలక్ష్మి, అనిల్ రెడ్డి, కే రాజారెడ్డి, కే మాధవరెడ్డి, ఓ కిషోర్ యాదవ్, బీ మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.